క్లుప్తంగా

అభివ్యక్తి నైపుణ్యాలతో ఉపాధి అవకాశాలు



గుంటూరు ఎడ్యుకేషన్: అభివ్యక్తి నైపుణ్యాల(కమ్యూనికేషన్ స్కిల్స్)తో ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోగలరని ఆంధ్ర క్రైస్తవ కళాశాల ఆంగ్ల అధ్యాపకురాలు అన్నా షాలిని పేర్కొన్నారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాల ఆంగ్ల విభాగ ఆధ్వర్యంలో గురువారం సాఫ్ట్ స్కిల్స్‌పై అతిథి ఉపన్యాసం నిర్వహించారు. ముఖ్యవక్తగా పాల్గొన్న షాలిని మాట్లాడుతూ ప్రతి విద్యార్థిలో అంతర్గత నైపుణ్యాలు ఉంటాయని, వాటిని గ్రహించి సాధన చేయడం ద్వారా విజయతీరాలకు చేరుకోవచ్చని సూచించారు. నాయకత్వ లక్షణాలను అభివృద్ధి పరచుకుని, అందరితో చక్కటి సంభాషణ ద్వారా భాషా నైపుణ్యాలను అలవర్చుకోవాలని తెలిపారు. బలం, బలహీనతలను గుర్తించి శక్తివంతంగా తయారు కావాలని సూచించారు. సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలతో పాటు సమయపాలన, క్రమశిక్షణ, అంకితభావం వంటి లక్షణాలను అలవర్చుకుని జీవితంలో ముందుకు వెళ్లాలని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. అనితాదేవి, వైస్ ప్రిన్సిపాల్ భానుమురళి, ఆంగ్ల విభాగాధిపతి జి. భాగ్యమ్మ, అధ్యాపకులు వై. అమూల్య, పి. చంద్రిక, ఆర్. జయశైలజ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి

లక్ష్మీపురం: ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి డిమాండ్ చేశారు. 41 డివిజన్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప ప్రాంతంలో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులైన పేదలకు పట్టణాల్లో రెండు సెంట్లు, పల్లెల్లో మూడు సెంట్లు స్థలం కేటాయించాలని కోరారు. ఆ స్థలంలో గృహ నిర్మాణానికి రూ. 5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు పేదలతో వ్యక్తిగత అర్జీలు పూర్తి చేయించి సచివాలయ అడ్మిన్‌కు అందజేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ డివిజన్ కార్యదర్శి చేపర్తి కృష్ణారావు, కృష్ణ, నాగేంద్రం, మాధవి, చిరు వ్యాపారుల సంఘం నాయకులు సైదారావు, శీను నాయక్ పాల్గొన్నారు.

సందడిగా ఉషోదయ కళానికేతన్ వార్షికోత్సవం



నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై గురువారం సాయంత్రం ఉషోదయ కళానికేతన్ 18వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ దర్శకులు, రచయిత చెరుకూరి సాంబశివరావు రచించిన త్రిశూలం నాటకాన్ని ఆవిష్కరించారు. ఏపీ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, సినీ నటులు డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు, కె.సి.పి. ఇండియా లిమిటెడ్ ఉపాధ్యక్షులు వజ్ఝా మధుసూదనరావు, నటులు, దర్శకులు జరుగుల రామారావు, కావూరి సత్యనారాయణ, ఆలయ పాలక మండలి అధ్యక్షులు సీహెచ్.మస్తానయ్య, నటులు మానాపురం సత్యనారాయణ, ఎంపీఐ బి.మధుసూదనరావు, కళావిపంచి అధ్యక్షులు బొప్పన నరసింహారావు పాల్గొన్నారు. సభకు రచయిత, నాటక ప్రయోక్త కందిమళ్ల సాంబశివరావు అధ్యక్షత వహించారు. అనంతరం ఉషోదయ కళానికేతన్ (కాట్రపాడు) నిర్వహణలో చెరుకూరి సాంబశివరావు రచన, దర్శకత్వం వహించిన కిడ్నాప్ నాటిక సందేశాత్మకంగా సాగింది. ఆరాధన ఆర్ట్స్ అధ్యక్షులు డి.తిరుమలేశ్వరరావు, గరికపాటి వెంకటరామారావు, యువ కళావాహిని ప్రధాన కార్యదర్శి మల్లికార్జునరావు, సయ్యద్ జానీబాషా పాల్గొన్నారు.

తెలుగు సాహితీ లోకంలో విలక్షణ కవి 'బైరాగి'



నగరంపాలెం: తెనాలిలో జన్మించిన ఆలూరి బైరాగి తనదైన కంఠస్వరంతో తెలుగు సాహితీ లోకంలో విలక్షణ కవిగా రాణించారని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పాపినేని శివశంకర్ అన్నారు. గుంటూరు పుస్తక మహోత్సవ ప్రాంగణంలో అరసం ఆధ్వర్యంలో గురువారం సాహిత్య విమర్శకులు కందిమళ్ల శివప్రసాద్ అధ్యక్షతన బైరాగి శత జయంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా శివశంకర్ మాట్లాడుతూ బైరాగి అత్యంత మౌలిక భావనలతో, స్వభావ సహజత్వం, నిసర్గ కవితాశక్తి, జీవతం పట్ల అపార ప్రేమ నిండిన కవిత్వం రాశారని తెలిపారు. సభలో అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ, జిల్లా కార్యదర్శి బుల్లా రవి పాల్గొన్నారు.



మూతపడిన లిబర్టీ థియేటర్



కొత్తపేటలో మూతపడిన మెట్రో, టాలీవుడ్ థియేటర్లు

వెండి తెర వెలవెల

- నగరంలో మూతపడుతున్న సినిమా థియేటర్లు
- ప్రేక్షకుల ఆదరణ కరువు
- రోడ్డున పడిన వందలాది కుటుంబాలు

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఇంట్లోనే సినిమా వీక్షణ

నగరంపాలెం: జిల్లాలో సినిమా థియేటర్లు ఒక్కొక్కటిగా మూతపడుతున్నాయి. ప్రేక్షకుల ఆదరణ కరువైంది. క్రమేణా థియేటర్లకు వచ్చే వారి సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. దీంతో పట్టణంలో సందడి వాతావరణం కరువైంది. సుమారు 25–30 ఏళ్ల కిందట థియేటర్లు కళకళలాడేవి. అగ్రనటుల చిత్రాలు విడుదలైతే ఆ ఉత్సాహం చెప్పలేనిది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం మార్కెట్‌లోకి రావడంతో థియేటర్లు వెలవెలబోతున్నాయి.

'ఉమ్మడి'లో 250కి పైగా థియేటర్లు

ఉమ్మడి గుంటూరు జిల్లాలో గతంలో 250కు పైగా సినిమా థియేటర్లు ఉండేవి. చిన్న చిత్రాలు మొదలుకుని పెద్ద చిత్రాలు వరకు ప్రదర్శించేవారు. దీంతో అభిమానులు సందడి చేసేవారు. లోపల ఈలలు, కేకలతో దద్దరిల్లిపోయేది. అప్పట్లో అభిమాన సంఘాలు బ్యానర్లు కట్టేవారు. థియేటర్లకు ప్రేక్షకులను రప్పించేందుకు ప్రధాన కూడళ్లల్లో, ఏరియాల్లో యజమానులు హాల్ సిబ్బందితో పోస్టర్లను అతికింపజేసేవారు. దీనికితోడు అభిమాన నటుల చిత్రాల విడుదలతో ఫ్యాన్స్‌కు మరింత బాధ్యత ఉండేది. వంద రోజుల (మెయిన్) థియేటర్, వారం లేదా రెండు వారాలకు వచ్చే థియేటర్లను సుందరంగా అలకరించేవారు. ఇక విడుదలైన చిత్రాలు బంపర్ హిట్ అయితే అర్ధ శత దినోత్సవాలు, శత దినోత్సవాలు అట్టహాసంగా జరిగేవి. ఒక్కొక్కసారి నటులు, చిత్ర తారాగణం విచ్చేసి సందడి చేసేవారు. ప్రధాన ద్వారాలకు స్వాగతోరణాలు మొదలుకుని బ్యానర్లు కట్టడం, 25 అడుగులకు పైగా భారీ కటౌట్లను ఏర్పాటు చేసేవారు. ఇక బాక్స్‌లకు కొబ్బరికాయలు కొట్టి, హారతులిచ్చేవారు. టికెట్లు చేజిక్కించుకుని తొలి ఆట చూసేందుకు అభిమానులు శతవిధాలుగా ప్రయత్నించేవారు. ప్రస్తుతం ఈ సందడి తగ్గింది. అటువంటి పరిస్థితులేవ్వు.



అలంకార్ థియేటర్ ఉన్న చోట ప్రస్తుతం షాపింగ్ మాల్



శ్రీవిజయ థియేటర్ స్థానంలో ప్రస్తుతం ఖాళీ స్థలం

సాంకేతిక ప్రభావం

ప్రస్తుతం ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చింది. దాని ప్రభావం థియేటర్లపై కనిపిస్తోంది. దీంతో మూసుకునే పరిస్థితికి చేరుతున్నాయి. మొబైల్ ఫోన్లల్లో సకలం అందుబాటులోకి రావడంతో మరింతగా దిగజారిందని చెప్పవచ్చు. దీనికితోడు యాప్‌లు బోలెడన్నీ అందుబాటులోకి వచ్చాయి. వాటిని డౌన్ లోడ్ చేసుకుంటే చాలు.. ఎంచక్కా కొత్త చిత్రాలను వీక్షించవచ్చు. తద్వారా ప్రేక్షకులు థియేటర్ల వైపు చూడటంలేదు. గతంలో ఉమ్మడి జిల్లా పరిధిలో 250 థియేటర్లు ఉండగా, ప్రస్తుతం 165 మాత్రమే అందుబాటులో ఉన్నాయి. వాటిల్లోనూ కొన్ని మాత్రమే అగ్రనటుల సినిమాలు వచ్చినప్పుడు ప్రేక్షకులకు అందుబాటులో ఉంటున్నాయి. మిగతా వేళల్లో ఖాళీగా దర్శనమిస్తాయి. జిల్లాలోని పలు థియేటర్ల పరిస్థితి ఇదే విధంగా ఉంది. గుంటూరు నగరంలో 32 థియేటర్లు ఉండగా అందులో ఓ ఇరవై మల్టీపెక్స్ ఉన్నాయి. అందులో పదికి పైగా మూతపడ్డాయి.

నగరంలో పరిస్థితి ఇది

గుంటూరు నగరంలో పేరొందిన సినిమా థియేటర్లు ఉండేవి. ప్రస్తుతం అవి కానరావడం లేదు. గతంలో రాధాకృష్ణ థియేటర్‌లో ఎక్కువగా ఎన్‌టీఆర్, ఏఎన్నార్, కృష్ణ, శోభన్‌బాబు, కృష్ణంరాజు, చంద్రమోహన్ పలువురు నటుల చిత్రాలు ప్రదర్శించేవారు. కృష్ణా పిక్చర్ ప్యాలెస్, హరిహర్ మహల్, మంగా థియేటర్లల్లో అగ్ర నటుడు చిరంజీవి చిత్రాలు అధికంగా ప్రదర్శించేవారు. యాభై ఏళ్లకు పైబడిన థియేటర్లల్లో చాలా వరకు మూతపడ్డాయి. పాత గుంటూరులో వెంకట్రామా, రాధాకృష్ణ, మెట్రో (కృష్ణాపిక్చర్ ప్యాలెస్), టాలీవుడ్ (లిటిల్ కృష్ణ), మంగా , రంగమహల్, శేషమహల్, లిబర్టీ, కృష్ణమహల్, వెంకటకృష్ణ, శ్రీవిజయ, అలంకార్, స్వామి తదితర థియేటర్లన్నీ కూడా మూతపడ్డాయి. మూతపడిన వాటిల్లో చాలా వరకు ప్రేక్షాకదరణ లేకపోవడమే ప్రధాన కారణమని కొందరు యాజమానులు చెబుతున్నారు. దీంతో వందలాది కుటుంబాలు వీధిన పడ్డాయి. థియేటర్లలో పని చేసే వారు చేతివృత్తుల వైపు వెళ్లిపోయారు. యజమానులు మాత్రం థియేటర్లు లేని చోట పెద్ద మాల్స్, ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలు, చీరల ప్రదర్శన అమ్మకాలు తదితర వాటికి అద్దెలకు ఇస్తున్నారు. ప్రస్తుతం శ్రీవిజయ, స్వామి థియేటర్లు కూల్చి వేయగా, ఖాళీ స్థలాలుగా దర్శనమిస్తున్నాయి.



పట్టాభిపురంలో ప్రస్తుతం ఖాళీ స్థలంగా మారిన స్వామి థియేటర్

ఉపాధి హామీ పథక పరిరక్షణే ధ్యేయం



నెహ్రూనగర్ : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథక పరిరక్షణకు పోరాటం చేస్తామని దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) వ్యవస్థాపక అధ్యక్షుడు కొరివి వినయ్ కుమార్ అన్నారు.గ్రామీణ ఉపాధి హామి పథకాన్ని ఎత్తివేతకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కుట్రలను మానుకోవాలని, బడ్జెట్ పెంచాలని డిమాండ్ చేస్తూ గురువారం ఢిల్లీలో ప్రారంభమైన ధర్నాలో పాల్గొన్న వినయ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధి హామీ నిధుల కేటాయింపును ప్రభుత్వం తగ్గిస్తోందని ఆరోపించారు. కూలీలకు 100 రోజుల పనిని అందించడానికి బడ్జెట్ జీడీపీలో కనీసం 2 శాతం ఉండాలని కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సులు చేసినప్పటికీ అమలు కావడంలేదని తెలిపారు. ప్రస్తుత బడ్జెట్ కేటాయింపు నామమాత్రంగానే ఉందని పేర్కొన్నారు. పనులు కల్పించకుండానే దేశవ్యాప్తంగా పది కోట్ల మంది కూలీల పేర్లను జాబ్ కార్డుల నుంచి తొలగించడం చట్ట విరుద్ధమని ఆయన పేర్కొన్నారు.

బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడి అమానుషం

గుంటూరు మెడికల్: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను యావత్ హిందూ సమాజం, హిందూ ఐక్యవేదికగా తీవ్రంగా ఖండిస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ తెలిపారు. అక్కడ ఇస్కాన్‌కి సంబంధించిన చిన్మయ కృష్ణ దాస్, ఆదిపురుష శ్యామ్ దాస్, రంగానంద్ దాస్‌ను అరెస్టు చేసి వారి మీద అభియోగం మోపడం తీవ్రమైన చర్యగా భారత దేశ ప్రజలందరూ భావిస్తున్నారని పేర్కొన్నారు. దేశ అధ్యక్షుడుగా ఉన్న మహమ్మద్ యూనస్ దాడులను ఖండించకపోవడమే కాకుండా ప్రజలందరినీ భయభ్రాంతులకు గురి చేసే విధంగా సందేశాన్ని ఇస్తున్నారని ఆరోపించారు. వెంటనే ఆయన స్పందించి హిందువులకు రక్షణ కల్పించాలని కోరారు.

లక్ష్యానికి అనుగుణంగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలి

నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు



అధికారులతో సమావేశమైన కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ హౌసింగ్ లే అవుట్స్‌లో ఇళ్ల నిర్మాణ పనుల కాంట్రాక్టు పొందిన కాంట్రాక్టర్లు, సొంతంగా నిర్మాణం చేసుకునే వారు డిసెంబర్ నాటికి పూర్తి చేసేలా హౌసింగ్, నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షణ చేయాలని నగరపాలక సంస్థ కమీషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. గురువారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్‌లో ఇంజినీరింగ్, హౌసింగ్ డిపార్ట్‌మెంట్ అధికారులు, ఎమినిటీ కార్యదర్శులు, కాంట్రాక్టర్లు, మెప్మా సిబ్బందితో పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. తొలుత లే అవుట్స్ వారీగా ఇళ్ల నిర్మాణం, మౌలిక వసతులు, బిల్స్ చెల్లింపు, ఇసుక, సిమెంట్, ఇనుము లభ్యత తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులు వేగంగా చేయాలని ఆదేశించారు. ఇప్పటికే పేరేచర్ల లే అవుట్‌లో బోర్లు ఏర్పాటు చేశామని, త్వరలో లే అవుట్ ప్రధాన రోడ్ మరమ్మతులు పూర్తి చేస్తామని తెలిపారు. లబ్ధిదారుల్లోని డ్వాక్రా సభ్యులకు బ్యాంక్‌ల నుంచి రూ.35 వేలు రుణం అందించేలా చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యంగా ఉంటున్న మెప్మా సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం నాటికి రుణాలు మంజూరు పూర్తి చేయాలని చెప్పారు. సమావేశంలో అదనపు కమిషనర్ సీహెచ్.ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య, మెప్మా పీడీ విజయలక్ష్మి, హౌసింగ్ ఈఈ శంకరరావు, ఈఈ సుందరరామిరెడ్డి, ఉపా సెల్ పీఓ రామారావు పాల్గొన్నారు.

రిజర్వాయర్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

గోరంట్ల కొండ మీద రిజర్వాయర్ పనులు అత్యవసరమని, అగ్రిమెంట్ మేరకు పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయని కాంట్రాక్టర్‌కి నోటీసు ఇవ్వాలని ఇంజినీరింగ్ అధికారులను నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. గురువారం కమిషనర్ గోరంట్ల కొండ మీద రిజర్వాయర్ పనులు, తక్కెళ్లపాడులో పంపింగ్ లైన్ మీద ఏర్పడిన లీకును పరిశీలించి ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. .

రహదారులు పచ్చదనంతో నిండాలి

గ్రీన్ గుంటూరుగా ఉండేలా పార్క్ అధికారులు, కార్మికులు కృషి చేయాలని కమిషనర్ పులి శ్రీనివాసులు ఏడీహెచ్‌ని ఆదేశించారు. హార్టీకల్చర్ సిబ్బంది ఇతర విధుల్లో ఉంటే వారిని వెంటనే వెనక్కు పిలిచి, పార్క్‌ల విధులు కేటాయించాలని ఆదేశించారు. గురువారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్‌లో ఏడీహెచ్ శ్రీనివాసరావుతో కలిసి నగరంలో పచ్చదనం పెంపు, కార్మికుల పని విధానంపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పార్క్‌లు, ప్రధాన, అంతర్గత రహదారుల్లో మొక్కలను విరివిగా నాటి సంరక్షించాలని ఆదేశించారు.

అంకితభావంతో విధులు

నగరపాలక సంస్థ వెహికిల్ షెడ్‌లోని డ్రైవర్లు అంకిత భావంతో విధులు నిర్వహించాలని, నిర్లక్ష్యంగా ఉండే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. ఆయన గురువారం కేవీపీ కాలనీలోని జీఎంసీ వెహికల్ షెడ్‌ని విభాగాధిపతులతో కలిసి పరిశీలించారు. వాహనాల డ్రైవర్లు శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో సమన్వయంతో ఉండాలని ఆయన సూచించారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించాలి

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఏటా నిర్వహిస్తున్న విధంగానే ఈ ఏడాది కూడా సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మునిసిపల్ ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ అండ్ శానిటేషన్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు మద్దిరాల జోసెఫ్ ఇమ్మానియేల్ కోరారు. ఈ మేరకు యూనియన్ నాయకులు గురువారం నగర కమిషనర్‌ను ఆయన చాంబర్‌లో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2016 నుంచి నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఉద్యోగ, కార్మికుల సమక్షంలో ప్రోటోకాల్ ప్రకారం గుంటూరు నగరంలోని ప్రజాప్రతినిధులు, అధికారులను ఆహ్వానించి వేడుకలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు. నగరపాలక సంస్థలో ఔట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న కార్మికులకు ఎక్కడైతే ఖాతాలు ఉన్నాయో ఆ బ్యాంకు ద్వారా రుణాలు మంజూరు చేయించాలని కోరారు. కమిషనర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తామని తెలిపారు. అర్హులైన కార్మికులందరికీ బ్యాంకు రుణాలు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఈదుల మూడి మధుబాబు పాల్గొన్నారు.

బైక్ రేస్‌లు అరికట్టేందుకు చర్యలు



స్పీడ్ బ్రేకర్లు పరిశీలిస్తున్న డీఎస్పీ రమేష్, సీఐ సింగయ్య తదితరులు

పట్నంబజారు: నగరంలో బైక్ రేస్‌లు అరికట్టేందుకు చర్యలు చేపడుతున్నామని ట్రాఫిక్ డీఎస్పీ ఎం.రమేష్ చెప్పారు. గుంటూరు నగరంలో పలు ప్రాంతాల్లో నూతనంగా ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లు, ప్రమాద హెచ్చరిక బోర్డులను గురువారం పరిశీలించారు. మితిమీరిన వేగంతో ద్విచక్ర వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు గురవుతున్నందున పలు చర్యలు తీసుకున్నట్లు డీఎస్పీ రమేష్ తెలిపారు. కొరిటెపాడు – గుజ్జనగుండ్ల ప్రధాన రహదారిపై ఇరువైపులా ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. లక్ష్మీపురం, కొరిటెపాడు ప్రధాన రహదారి తదితర ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. వేగ నియంత్రణ కోసం స్పీడ్ బ్రేకర్లు, స్టాప్ బోర్డు, ట్రాఫిక్, ట్రాఫిక్స్ కోన్స్ ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రధాన రహదారి వెంట సీసీ కెమెరాలతో నిరంతరం నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఎవరైనా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వేగంగా కన్న ప్రాణం మిన్న అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని ఆయన సూచించారు. రోడ్డు భద్రత గురించి విద్యార్థులు, యువతకు తల్లిదండ్రులు కూడా తెలియజేయాలని చెప్పారు. కార్యక్రమంలో ట్రాఫిక్ వెస్ట్ సీఐ సింగయ్య పాల్గొన్నారు.

8న ప్రొఫెసర్ కంచె ఐలయ్య పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని చూపిస్తున్న డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు, న్యాయవాది వైకే తదితరులు

గుంటూరు మెడికల్: ప్రొఫెసర్ కంచె ఐలయ్య షఫర్డ్ రచించిన 'ది క్షుద్ర రెబీలియన్' పుస్తకావిష్కరణను ఈనెల 8న సాయంత్రం 4 గంటలకు బ్రాడీపేట 4వ లైనులోని సింధూరి నిర్వహిస్తున్నట్లు ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు చెప్పారు. గుంటూరు అమరావతి రోడ్డులో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమానికి మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ వియ్యన్నరావు, ప్రముఖ న్యాయవాది వై.కోటేశ్వరరావు (వైకే), లేబర్ డిపార్టుమెంట్ అడిషనల్ సెక్రటరీ గంధం చంద్రుడు హాజరవుతున్నట్లు తెలిపారు. సాహిత్య అభిమానులు, సామాజిక కార్యకర్తలు పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొనాలని న్యాయవాది వై.కోటేశ్వరరావు కోరారు. సమావేశంలో టి.సుబ్రహ్మణ్యం, వేముల రాజా, దాసరి తిరుపతిరావు, కె.కోటేశ్వరరావు, సాంబయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.

మిర్చి యార్డులో సమస్యల పరిష్కారానికి కృషి

రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు



మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

కొరిటెపాడు(గుంటూరు): మిర్చి యార్డులో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు చెప్పారు. గుంటూరు చుట్టుగుంట సెంటర్‌లోని రాష్ట్ర మార్కెటింగ్ శాఖ కార్యాలయం ఆవరణలోని సమావేశ మందిరంలో మిర్చి యార్డులోని వివిధ అసోసియేషన్‌ల నాయకులు, అధికారులతో గురువారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. వచ్చే సీజన్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రైతులకు మద్దతు ధర తదితర అంశాలపై ఆయన చర్చించారు. మిర్చి కమీషన్ వ్యాపారుల లైసెన్స్‌లపై ప్రత్యేక విధానం తెస్తామని వెల్లడించారు.

వ్యాపారం చేయని వారి లైసెన్స్‌లను రద్దు చేయడంతో పాటు, వ్యవస్థను పటిష్టం చేస్తామని స్పష్టం చేశారు. రాబోవు సీజన్‌లో మిర్చి రైతులకు ఎలాంటి సమస్యలు లేకుండా, మంచి ధర లభించేలా చూడాలని యార్డు అధికారులను ఆదేశించారు. ట్రాన్స్‌పోర్టు సమస్యను ఎగుమతి వ్యాపారులు మంత్రి దృష్టికి తెచ్చారు. ఆ శాఖ కమిషనర్‌తో ప్రత్యేకంగా మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని అచ్చెన్నాయుడు హామీ ఇచ్చారు. ఈ–నామ్ విధానంలోనే వ్యాపారం కొనసాగేలా చూడాలని తెలిపారు. సీజన్‌లో యార్డుకు భారీ స్థాయిలో మిర్చి బస్తాలు వస్తే ఇబ్బందికరంగా ఉన్న దృష్ట్యా ప్రత్తిపాడు నియోజకవర్గంలో 100 నుంచి 200 ఎకరాల్లో అధునాతన టెక్నాలజీతో నూతన మార్కెట్ యార్డు నిర్మాణం చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ గుంటూరు మార్కెట్ యార్డుకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. గుంటూరు పశ్చిమ, తూర్పు, ప్రత్తిపాడు ఎమ్మెల్యేలు గళ్లా మాధవి, నసీర్ అహ్మద్, బి.రామాంజనేయులు మాట్లాడుతూ యార్డులో మచ్చు కాయల దోపిడీ, జీరో వ్యాపారానికి స్వస్తి పలకాలని సూచించారు. మిర్చి దిగుమతి వ్యాపారుల అసోసియేషన్ అధ్యక్షుడు లేళ్ల పెద్ద అప్పిరెడ్డి మాట్లాడుతూ రైతులు అమ్మిన సరుకుకు 24 గంటల్లో డబ్బులు ఇచ్చి పంపుతున్నామని, కమిషన్ రెండు శాతం మించి తీసుకోవడం లేదని స్పష్టం చేశారు. సమావేశంలో మార్కెటింగ్ శాఖ కమిషనర్ ఎం.విజయ సునీత, స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్, జేసీ భార్గవ్ తేజ, మార్కెటింగ్‌శాఖ అధికారులు పాల్గొన్నారు.

వృద్ధులకు ఉపయోగం లేని 'ఆయుష్మాన్ భారత్'

లక్ష్మీపురం: అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో 'ఆయుష్మాన్ భారత్ – ఉపయోగాలు' అనే అంశంపై గురువారం చర్చ నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ ఫోరం నాయకులు సిరసవల్లి కృష్ణారావు మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ పథకం కింద నమోదైన ఆసుపత్రులలో చికిత్స అందించడానికి నిరాకరించడంతోపాటు, పలు షరతులు పెడుతున్నట్లు పేర్కొన్నారు. విద్యావేత్త ఆర్.వి.సింగరయ్య మాట్లాడుతూ వైద్యపరంగా అత్యవసర పరిస్థితుల సమయంలో ఆసుపత్రి వైద్యులు చికిత్సను నిరాకరిస్తున్నారని తెలిపారు. విశ్రాంత అధికారి పి.భావన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సుస్థిరాభివృద్ధికి పనిచేయాలి



మాట్లాడుతున్న వెంకట్రావు

గుంటూరు ఎడ్యుకేషన్: గ్రామాల్లో సుస్థిరాభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ అభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఐఆర్‌డీఆర్) రాష్ట్రస్థాయి పర్యవేక్షకుడు డి.వెంకట్రావు పేర్కొన్నారు. జెడ్పీ సమావేశ మందిరంలో గురువారం రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ (ఆర్జీఎస్ఏ 2024–25) కార్యాచరణ ప్రణాళికపై పల్నాడు జిల్లాకు చెందిన వివిధ శాఖల అధికారులు, సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ప్రతి ఒక్కరూ విషయ పరిజ్ఞానం, క్రమశిక్షణ అలవర్చుకుని ప్రగతి సాధించేందుకు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఉపాధి హామీ వంటి పథకాలను సద్వినియోగం చేసుకుని జీవన నైపుణ్యాలు పెంపొందించుకునేలా ప్రోత్సహించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐఆర్‌డీ కన్సల్టెంట్ కె. మోహనరావు, రిసోర్స్ పర్సన్లు పి. రామకృష్ణ, వి. వరప్రసాద్, షేక్ షఫీ, ఎన్. కొండయ్య, ఎస్. వెంకటరమణ, నోడల్ అధికారి శ్రీవాణి, కె. అనూరాధ పాల్గొన్నారు.

లేడీస్ హాస్టల్ చీఫ్ వార్డెన్‌గా మాధవి

ఏఎన్‌యూ: నాగార్జున విశ్వవిద్యాలయ మహిళా వసతి గృహ చీఫ్ వార్డెన్‌తో పాటు అడిషనల్ చీఫ్ వార్డెన్, డెప్యూటీ వార్డెన్‌లను నియమిస్తూ వీసీ ఆచార్య కె.గంగాధరరావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. చీఫ్ వార్డెన్‌గా బోటనీ అండ్ మైక్రో బయాలజీ విభాగ అధ్యాపకురాలు జె.మాధవి, అదనపు చీఫ్ వార్డెన్‌గా ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకురాలు వై.సునీత, ఫార్మసీ కళాశాల అధ్యాపకురాలు ఎస్. సుజనలను నియమించారు. డెప్యూటీ వార్డెన్లుగా ఏ.ఎస్.వి.రాధిక, వి. సుభాషిణి, టి. ఝాన్సీలను నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఇంజినీరింగ్ కళాశాల వసతి గృహాల చీఫ్ వార్డెన్‌గా అసిస్టెంట్ ప్రిన్సిపాల్ ఎం.గోపీకృష్ణ, అసిస్టెంట్ ప్రిన్సిపాల్ డి. చంద్రమౌళీలకు అడిషనల్ చీఫ్ వార్డెన్ బాధ్యతలు అప్పగించారు. డెప్యూటీ వార్డెన్‌లుగా ఆర్.విజయ్ ప్రకాష్, యు. సతీష్ కుమార్, కె.ఎస్. రాజశేఖర్, సీహెచ్. పుణ్యశేఖర్, బి. విజయకుమార్‌ను నియమించారు. వీరు ఏడాది పాటు వార్డెన్లుగా విధులు నిర్వహించనున్నారు. నూతనంగా నియమితులైన వార్డెన్‌లకు వీసీ ఆచార్య కె.గంగాధరరావు, రెక్టార్ ఆచార్య కే. రత్నషీలా మణి, రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలంలు నియామక ఉత్తర్వులు అందజేశారు.